క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ ఫర్హత్‌అలీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆటోనగర్ పారిశ్రామికవాడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11 కేవీ డీర్‌పార్కు ఫీడర్ పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమం మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. శనివారం 20వ రోజు ఈ కార్యక్రమాన్ని హర్షగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది గ్రామంలో వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. డ్రైనేజీ, నాలాలను క్లీన్ చేశారు. పరిసరాల-పరిశుభ్రత, తడి, పొడి చెత్త వేరుచేయు విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ వాణి, ఆర్ఐ మల్లేశ్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ప్రత్యేక పూజలు



అద్దాల మేడలో స్వామివారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడలో గల శ్రీచక్రగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు, అలంకరణ చేశారు. స్వామివారికి నూతనంగా ఏర్పాటు చేసిన అద్దాల మేడను భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అజయ్ శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.

భావజాల వ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు



జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మీర్‌పేట: తెలంగాణ భావజాల వ్యాప్తికి నిరంతరం కృషి చేసిన నాయకుడు ప్రొఫెసర్ జయశంకర్ అని మీర్‌పేట కార్పొరేషన్ మాజీ కోఆప్షన్ సభ్యుడు రజాక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా శనివారం నందిహిల్స్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని, తెలంగాణ కోసమే బ్రతికిన, శ్వాసించిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా విభాగం మీర్‌పేట అధ్యక్షురాలు సునీత, నాయకులు జగాల్‌రెడ్డి, హమునాయక్, బాలరాజు, సిగం రాజు, రమేశ్, పద్మ, మణెమ్మ పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

కొందుర్గు: మండలంలోని శ్రీరంగాపూర్ చిన్న ఎల్కిచర్ల రోడ్డుకు శనివారం తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. రోడ్డు గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పురుషోత్తంరెడ్డి, సయ్యద్ సాదిక్, మల్లేశ్‌గౌడ్, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బడంగ్‌పేట్: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



కందుకూరు: కొత్తూర్‌లో ఉపాధి కూలీలతో కలిసి యోగా చేస్తున్న డీఆర్డీఓ శ్రీలత, ఎంపీడీఓ సరిత

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, మైదానాల్లో యోగా నిపుణుల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆసనాలు వేశారు. యోగా సర్వ రోగాలకు నివారిణిగా పని చేస్తుందని, ప్రతి రోజు తప్పనిసరిగా సాధన చేయాలని నిపుణులు సూచించారు.



మీర్‌పేట: మీర్‌పేటలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



కందుకూరు: జైత్వారంలో విద్యార్థులతో కలిసి యోగా చేస్తున్న ఉపాధ్యాయులు



తుక్కుగూడ: యోగా చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



తుక్కుగూడ: ఇమామ్‌గూడ పాఠశాలలో..



పహాడీషరీఫ్: ఓ పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



మహేశ్వరం: రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో..

నిలువ నీడ కరువు

- ఎండ, వానకు రోడ్లపైనే ప్రయాణికులు ఎదురుచూపులు
- దుకాణాల ఎదుట, చెట్ల నీడన బస్సుల కోసం నిరీక్షణ
- బస్టాండ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు అభ్యర్థన





తుక్కుగూడ శ్రీశైలం జాతీయ రహదారి వద్ద షాపుల వద్ద నిలిచి ఉన్న ప్రయాణికులు

తుక్కుగూడ: ఆర్టీసీ ప్రయాణికులకు నిలవ నీడ కరువైంది. ఎండకు ఎండుతూ, వానకు తడస్తూ రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. తుక్కుగూడ పురపాలిక పరిధిలోని పలు గ్రామాల్లో బస్టాండ్లు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు దృష్టిసారించడం లేదని మండిపడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నాలుగు చినుకులు కురిసినా తడిసిపోవాల్సి వస్తోందని చెబుతున్నారు. మరోవైపు నిర్ధారిత స్థలం లేకపోవడంతో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ బస్సులు నిలుపుతున్నారు. దీంతో ప్రయాణికులకు ఉరుకులు, పరుగులు తప్పడం లేదు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు బస్సుల కోసం వేచి చూసే క్రమంలో గంటల తరబడి నిలబడలేక నీరసపడుతున్నారు.

సమన్వయం లోపం

నగరానికి కూత వేటు దూరాన ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీలోని పలు గ్రామాల్లో బస్టాండ్లు లేవు. రావిర్యాలలో చెట్ల కింద, ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండా దిమ్మెల వద్ద నిరీక్షిస్తున్నారు. తుక్కుగూడలో బస్టాండ్ ఉన్నప్పటికీ అందుబాటులో లేదు. ప్రయాణికులు శ్రీశైలం జాతీయ రహదారిపై షాపుల ఎదుట నిలబడుతున్నారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. మంఖాల్‌లో రోడ్ల పక్కన ఉంటున్నారు. మున్సిపాలిటీలో బస్టాండ్ల ఏర్పాటు పట్ల ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు మధ్య సమన్వయ లోపం నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మున్సిపాపల్ పరిధిలోని బస్టాండ్లు లేని గ్రామాలను గుర్తించి, నూతన బస్టాండ్‌ను ఏర్పాటు చేసి, ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

- చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్న వైర్లు
- ఆందోళన చెందుతున్న స్థానిక రైతులు
- పట్టించుకోని అధికారులు



వ్యవసాయ పొలాల్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతు

కందుకూరు: మండల పరిధిలోని ఆకులమైలారం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. చేయి ఎత్తితే అందేలా ఉంది పరిస్థితి. రైతులు వ్యసాయ పనుల్లో నిమగ్నమైనప్పుడు ఆదమరిస్తే అంతే సంగతులు. మీర్‌ఖాన్‌పేట సబ్‌స్టేషన్ నుంచి గ్రామ పరిధిలోని వ్యవసాయ బోర్లకు 11కేవీ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన లైన్లు కిందికి వేలాడుతూ ఉన్నాయి. దాదాపుగా 15 మంది రైతుల పొలాల మీద నుంచి వెళ్లే లైన్ కిందికి వేలాడుతూ ఇలా ప్రమాదకరంగా మారింది. విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని హడలి పోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మార్పీఎస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి శంకర్‌రావుమాదిగ

షాబాద్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాసారం శంకర్‌రావుమాదిగ, మండల అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్యమాదిగ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఊరూరా జెండా ఆవిష్కరణలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలన్నారు. ఎమ్మార్పీఎస్ గత 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో అరవీరుల త్యాగం వృథా కాలేదన్నారు. మందకృష్ణ మాదిగ పోరాటంతోనే రిజర్వేషన్ సాధించుకున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు వేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ముక్కు విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్, తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొళ్ల ఆంజనేయులు, నాయకులు రాజ్‌కమాల్, శ్రీనివాస్, సతీష్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎంపీడీఓ అపర్ణ

షాబాద్: పచ్చని చెట్లే ప్రకృతిని సమతుల్యంగా ఉంచుతూ ప్రాణకోటికి జీవనాధారంగా ఉంటాయని ఎంపీడీఓ అపర్ణ అన్నారు. శనివారం మండల పరిధిలోని పోతుగల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురవాలంటే అడవుల శాతం పెరగాలన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటాలన్నారు. గ్రామాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ఒక ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటుతూ ముందుకు సాగాలని సూచించారు. నాటిన మొక్కలకు ప్రభుత్వం పారితోషకంగా రూ.5 ఇస్తుందని తెలిపారు. గ్రామాల్లో గల ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పచ్చదనం వెల్లివిరిసేలా చేస్తామన్నారు. మొక్కలు నాటే కార్యక్రమమే భావితరాలకు బంగారు బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మన్సాన్‌పల్లిలో జంక్షన్ ఏర్పాటు



మన్సాన్‌పల్లి చౌరస్తాలో జంక్షన్ ఏర్పాటు స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మన్సాన్‌పల్లి చౌరస్తాలో జంక్షన్‌ను ఏర్పాటు చేసి, అభివృద్ధి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి కూడలిలోని జంక్షన్ ఏర్పాటుపై ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరం- స్టేషన్ తిమ్మాపూర్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా నిర్మించాలని ప్రతిపాదనలు పంపామన్నారు. మన్సాన్‌పల్లిలో జంక్షన్ ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం, స్వామి వివేకానంద విగ్రహాలను మధ్యలో ఏర్పాటు చేసి జంక్షన్ ఏర్పాటు చేస్తామన్నారు. జంక్షన్ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు, కోళ్లపడకల్-సిద్ధాపూర్ వరకు గల సుమారు 2 కిలోమీటర్ల సింగిల్ వేను డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు నిర్మాణం, జంక్షన్ ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం డబిల్‌గూడలో రైతులతో ఆమె మాట్లాడి రైతు భరోసా వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్‌గౌడ్, పంచాయతీ రాజ్ డీఈ అనిల్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, అంబయ్య, సామ జాన్‌రెడ్డి, రాజేశ్, లింగం, రవీందర్, అంజనేయులుగౌడ్, దేవులానాయక్, దయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

ఆపదలో ఉన్నవారికి సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాకు చెందిన రాజు కుమార్తెకు వెన్నుపూస సమస్య ఉండడంతో ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు నిమిత్తం సీఎం సహాయ నిధి కింద ఎల్‌ఓసీ లెటర్‌ను బాధితులకు ఆమె అందజేశారు.

ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం

తహసీల్దార్ గోపాల్



కందుకూరు: రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం తెచ్చింది. అందులో భాగంగా కందుకూరు మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి 21 వరకు 29 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. భూ బాధితుల నుంచి 1,863 దరఖాస్తులు వచ్చి చేరాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ గోపాల్ మాట్లాడుతూ.. స్వీకరించిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో, మా పరిధిలో ఉన్న వాటిని త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మిగతా వాటి పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఏ గ్రామంలో ఎన్ని..

బాచుపల్లిలో 30, దెబ్బడగూడ 16, మహ్మద్‌నగర్ 6, పెరుగుగూడ 2, అన్నోజిగూడ 4, పులిమామిడి 161, తిమ్మాయిపల్లి 17, ధన్నారం 19, పంజగూడ 26, చిప్పలపల్లి 44, మీర్‌ఖాన్‌పేట 59, మురళీనగర్ 8, గుమ్మడవెల్లి 42, జైత్వారం కల్సా 22, మాదాపూర్ 34, తిమ్మాపూర్ 93, కొత్తూర్ 53, గఫూర్‌నగర్ 18, రాచులూరు 152, అక్బర్జా 7, లేమూరు 126, అలిఖాన్‌పల్లి 47, గూడూరు 70, నేదునూరు 281, దాసర్లపల్లి 121, ముచ్చర్ల 88, కందుకూరు 248, సార్లరావులపల్లిలో 69 దరఖాస్తులు వచ్చాయి. అందులో ఆన్‌లైన్‌లో మిస్సింగ్ సర్వే నంబర్లు సరి చేయడం కోసం 583, పెండింగ్ మ్యుటేషన్ల కోసం 172, డీఎస్ పెండింగ్ 101, విస్తీర్ణం సరి చేయడం కోసం 266, భూమి స్వభావానికి సంబంధించి 22, పట్టాదారు పేరు తదితర వాటిని సరిచేయడానికి 77, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని 253, ఓఆర్సీ కోసం 3, 38ఈ సర్టిఫికెట్ కోసం 1, సక్సేషన్ కోసం 213, ఇతర సమస్యల పరిష్కారం కోసం 172 అర్జీలు అందాయని అధికారులు వెల్లడించారు.

మహిళా గ్రూపులకు అండగా ఉంటాం

మున్సిపల్ కమిషనర్ సరస్వతి



స్ట్రీట్ వెండర్ ఫుడ్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేశారు. అనంతరం వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్ ఫుడ్ ఫెస్టివల్ స్టాల్‌ను కమిషనర్ ప్రారంభించారు. స్ట్రీట్ ఫుడ్ నిర్వహించే మహిళలకు శక్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. మహిళా గ్రూపులకు అండగా ఉంటామన్నారు. మహిళా గ్రూపు సభ్యులచేత ఏర్పాటు చేసిన స్టాళ్లను అందరూ ఆదరించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం ఏఎంసీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, 24వ డివిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ.. అల్మాస్‌గూడలోని పోచమ్మ, మైసమ్మ ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గాత, కాలనీల రహదారులను మరమ్మతు చేయాలని విన్నవించారు. బోనాల రోజుల గుడుల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

దాతల సహకారం మరువలేనిది



గ్రామస్తులకు బోర్‌మోటార్ అందిస్తున్న దాతలు

ప్రత్యేకాధికారి కృష్ణయ్య

చేవెళ్ల: మంచి నీటి సమస్య తీర్చేందుకు దాతలు చేసిన సహకారం మరువలేనిదని అంతారం ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండలంలోని అంతారంలో శనివారం మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి లక్ష రూపాయల సొంత ఖర్చులతో బోర్‌మోటార్‌ను ప్రత్యేకాధికారి సమక్షంలో గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న బోరుబావిలలో ఉన్న నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు బోరుమోటార్ బిగిస్తే బాగుంటుందని గుర్తించి దాతల సహకారం కోరామన్నారు. అడగగానే దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలు, ప్రత్యేకాధికారిని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మిర్జాగూడ మాజీ సర్పంచ్ భీమయ్య, సీనియర్ నాయకులు వెంకటేశ్‌బాబు, సీహెచ్ సుధాకర్, సత్యనారాయణ, పాషా, అనంతయ్య, తరుణ్, ప్రవీణ్, మానిక్యం, నాగేశ్, మణికంఠ, వీరాజంనేయులు, సిరాజ్, హరి, అనిల్, రామస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి



కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు, సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: పర్యావరణాన్ని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి స్వాతిరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి న్యాయవాదులతో కలిసి కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం యోగాసనాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వృత్తిలో భాగంగా న్యాయవాదులకు మానసిక ఒత్తిడి ఉంటుందని, ప్రతి రోజు యోగా సాధనచేస్తే మానసిక ఒత్తిడిని జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.